పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

- బలాలు నిరూపించేందుకు సిద్ధమవుతున్న పార్టీల నేతలు
- స్థానిక సంస్థల ఎన్నికలపై పెరుగుతున్న ఆశలు
- ఆశావహుల ఎదురు చూపులు



బీసీ మర్రిగూడెం పంచాయతీ కార్యాలయం

వెంకటాపురం(కె) : పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నిక కోసం ఆశావహులు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయటమే ఆలస్యమైనట్లు పంచాయతీ బరిలో దిగటానికి సిద్ధంగా ఉన్నారు. పాలకవర్గం గడువు ముగిసి ఏడాదిన్నర కాలం నుంచి ఎన్నికలు ఇందిలో, అదిగో నోటిఫికేషన్ విడుదల చేస్తామంటూ ప్రభుత్వం తరుచూ సంకేతాలు ఇస్తూనే వస్తుంది. కాగా ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం నుంచి వస్తున్న ప్రకటనలు, అధికారులు ఎన్నికల సామగ్రి పరిశీలన, బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుండటంతో స్థానిక ఎన్నికల పోరు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. దీంతో పల్లెల్లో నిశబ్దంగా ఉన్న రాజకీయాలు వేడెక్కాయి. సర్పంచ్‌లు, ఎంపీటీసీల బరిలో దిగి తమ భవిష్యత్‌ను పరీక్షించుకునేందుకు నాయకులతో పాటు యువతీ యువకులు ఉత్సాహం చూపుతున్నట్లు సమాచారం. పల్లెల్లో రాజకీయ పార్టీలు తమ బలాలు నిరూపించుకునేందుకు సవాల్‌గా తీసుకుంటున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేయాలని కోరుతున్నారు.

9 ఎంపీటీసీలు, 18 సర్పంచ్‌లు

మండలంలో 18 పంచాయతీల్లో 9 ఎంపీటీసీలు, 18 సర్పంచ్ స్థానాల పోరుకు ఆశావహులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. రాజకీయ పార్టీలు తమ పార్టీల నుంచి బలబాలాలు నిరుపించుకునేందుకు గ్రామస్థాయిలో కసరత్తులు మొదలు పెట్టినట్లు తెలుస్తుంది.

రిజర్వేషన్లపై ఆరా

పంచాయతీ ఎన్నికల పోరులో నిలబడేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు తమ పంచాయతీలో సర్పంచ్ రిజర్వేషన్, వార్డు సభ్యులు, ఎంపీటీసీల రిజర్వేషన్లు ఎలా వస్తాయనే విషయంపై ఆరా తీసుకుంటున్నట్లు సమాచారం.

ఓటరు జాబితాను సిద్ధం చేశాం



మండలంలోని 18 పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలను సిద్ధం చేశాం. ఎంపీటీసీల ఓటరు జాబితా తయారు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉంచాం. – రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

చెట్లతోనే మానవాళి మనుగడ

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఇంచర్లలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: చెట్లతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇంచర్లలోని ఏకో పార్క్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో 25 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఏకో పార్కులో వాచ్ టవర్లు, వాక్ ఫాల్స్ ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. అడవులను రక్షించడం పచ్చదనాన్ని కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెపారు. వన మహోత్సవం కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. అడవుల సంరక్షణతో సంవృద్ధిగా వర్షాలు కురువడంతోపాటు వాతావరణ సమతుల్యత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, టీఎస్ ఆర్‌ఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌కుమార్, టీజీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్ సుబ్రమణ్యం, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్‌జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఏపీఓ వసంతరావు, ఏపీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భవానీమాతగా రామలింగేశ్వరస్వామి



వెంకటాపురం(ఎం): శ్రావణ శుక్రవారం సందర్భంగా చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో రామలింగేశ్వర స్వామిని భవానీమాతగా అలంకరించినట్లు ఆలయ ప్రధాన పూజారి కోమలపల్లి హరీష్‌శర్మ తెలిపారు. రామప్పకు వచ్చిన పర్యాటకులు భక్తులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్ రామప్ప శిల్పకళా సంపద గురించి వివరించారు.

పాల్సాబ్‌పల్లిలో డ్రై డే కార్యక్రమం



మురుగు కాల్వలో స్ప్రే చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

ములుగు రూరల్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పాల్సాబ్‌పల్లిలో శుక్రవారం మున్సిపాలిటి సిబ్బంది డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతో కలిసి గ్రామంలోని నిల్వ ఉన్న నీటిని తొలగించారు, దోమలు వ్యాప్తి చెందకుండా లార్వాలను అరికట్టేందుకు నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, అంగన్ వాడీలు, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలి



సర్దార్‌సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ఏజెన్సీలో గీత కార్మికులకు అందరికి సేఫ్టీ మోకులు ఇవ్వాలని గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి గౌడ్ అన్నారు. శుక్రవారం గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సర్దార్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడుతూ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తాడి కార్పొరేషన్ చెక్కులను తక్షణమే బాధిత కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్దార్‌సింగ్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బుర్రా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్

వెంకటాపురం(ఎం) : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ గిరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మైనారిటీ గురుకుల కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాల రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అన్నారు. కళాశాలలో ఖాళీ సీట్లను భర్తీ చేయాలని అన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వందన, ఆర్ఐ విజేందర్ ఉన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

చిట్యాల: ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని భూపాలపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎన్.రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోపాలపూర్, నైన్‌పాక గ్రామాల్లోని ఎఆర్‌ఎస్‌కే, ఒడిసీఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, గోదాంలో నిల్వ చేసిన ఎరువుల బస్తాలను పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



అబ్బల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్ : మండలంలోని జాకారం గ్రామానికి చెందిన మహ్మద్ అబ్బల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క శుక్రవారం పరామర్శించారు. అబ్బల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన తిప్పారపు దేవరాజ్ మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్..

జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సదయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సదయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు చింతనిప్పుల భిక్షపతి, నల్లెల భరత్ కుమార్, నిల్, అభినయ్, రాంబాబు, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి వాసు

వెంకటాపురం(కె): ఈ నెల 6న చేపట్టిన మండల బంద్‌ను విజయ వంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండ కేంద్రం నుంచి యాకన్నగూడెం వరకు మరమ్మతులకు గురైన రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించాలని అన్నారు. రెండు నెలలుగా భద్రాచలం ఆర్టీసీ అధికారులను మండలానికి బస్సును ఏర్పాటు చేయాలని కోరగా రోడ్డు సక్రమంగా లేకపోవడం నడపడం లేదన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేసిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై బైఠాయించి ఆందోళన చేసినప్పుడు మాత్రమే అధికారులు గోతులు పూడ్చి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం చేసే పోరాటాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వంకా రాములు, కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహా చారి, ఆదినారాయణ, రమణయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



ఆందోళనకారుతో మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం(కె) : విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పంచాయతీ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై కొప్పుల తిరుపతిరావు సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాలలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- బాల సదనం కౌన్సిలర్ రాణి



విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న బాలసదనం కౌన్సిలర్ రాణి

కన్నాయిగూడెం : నేటి బాలలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాలసదనం కౌన్సిలర్ రాణి అన్నారు. మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి బాలలు సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దీంతో పాటు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదే విధంగా వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజ్మీరా యుగేందర్, మేకల కృష్ణప్రసాద్, తిరుపతమ్మ, సిద్దబోయిన అనిల్ కుమార్ పాల్గొన్నారు.

భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సొంది వీరయ్య

వెంకటాపురం(కె) : భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సొంది వీరయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం ఆవరణలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విభజన వల్ల భద్రాచలం పార్లమెంట్ స్థానం మహబూబాబాద్‌కు వెళ్లడంతో బంజార సామాజిక వర్గం వారే పార్లమెంట్ సభ్యులు అవుతున్నారని అన్నారు. భవిష్యత్‌లో ఆదివాసీ సామాజిక వర్గం పోటీ చేసే అవకాశం కనుచూపు మేరల్లో కనబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, ఉయక శంకర్, కోర్సా నర్సింహామూర్తి, వాసం నాగరాజు, కుంజా మహేష్, చింత సమ్మయ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం చేయకూడదు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

ములుగు రూరల్: గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయకూడదని డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు ప్రథమ చికిత్స ఇంజక్షన్, ఫ్లుయిడ్స్ ఇవ్వకూడదని అన్నారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రమని పేరు పెట్టుకోవాలని అన్నారు. అర్హతకు మించి వైద్యం చేసినట్లు ఫిర్యాదు అందితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండా చికిత్స అందించకూడదని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్‌కుమార్, శ్రీకాంత్, రంజిత్, ఏఎంఓ దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.

అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్ : విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ రవి తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని అన్నారు. 11 కేవీ ములుగు ఫీడర్–01 పరిధిలోని శ్రీనివాసకాలనీ, ప్రగతి కాలనీ, కలెక్టర్ ఆఫీస్, లారీ ఆఫీస్, ప్రేమ్‌నగర్, వీవర్స్‌కాలనీ, పత్తిమిల్లు ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని అన్నారు.

ఇసుక సొసైటీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వెంకటాపురం(కె) : మండలంలోని మొర్రవానిగూడెం గిరిజన ఇసుక సొసైటీ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించి గిరిజన సొసైటీను ఆదుకోవాలని ఇసుక సొసైటీ అధ్యక్షురాలు రామలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇసుక సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజ నులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇసుక సొసైటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రభుత్వం ఇసుక గోదావరి నుంచి బయటకు తీయించారని అన్నారు. వెలికి తీసిన ఇసుకను ప్రభుత్వం క్యూబిక్ మీటర్‌కు రూ.220 చెల్లిస్తుందని అన్నారు. 2020 నుంచి 2025 వరకు ఎలాంటి ఇసుక బిల్లులను సొసైటీలకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పద్మ, తది తరులు పాల్గొన్నారు.

రైతుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దావూద్



సమావేశంలో మాట్లాడుతున్న దావూద్

ఏటూరునాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దావూద్ తెలి పారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 2లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేస్తుందని రెండు లక్షలకు పైగా ఉన్న రైతులు మరి అప్పులు తెచ్చి రుణాలు కడితే కనీసం ఆ ఉన్న రెండు లక్షలు కూడా రుణమాఫీ కాలేదు అన్నారు. దాంతో రైతుల తీసుకొచ్చిన అప్పుల వడ్డీ పెనుభారంగా మారిందన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరికీ ఆ బోనస్‌ను ఇవ్వలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించాలని లేనిపక్షంలో కలిసొచ్చే పార్టీలను, ప్రజా సంఘాలను, రైతు సంఘాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా రైతాంగాన్ని సమీకరించి ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని దావూద్ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడి గేదెలు

వాజేడు : తెగిపడిన విద్యుత్ తీగ తగిలి రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం (చింతూరు గ్రామ పంచాయతీ) గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన గుండెబోయిన సరోజనకు ఉన్న రెండు పాడి గేదెలు మేత కోసం పొలాల వైపు వెళ్లాయి. అప్పటికే త్రీ ఫేజ్‌కు చెందిన విద్యుత్ తీగ తెగి కింద పడి ఉంది. మేత మేస్తూ వెళ్తున్న పాడి గేదెలు ఆ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి వెళ్లి గేదెలను చూడటంతో పాటు వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి సరఫరాను నిలిపి వేశారు. పశువైద్య సిబ్బంది వచ్చి పరిశీలించారు. విద్యుత్ తీగ ఎలా తెగిపడిందో తెలియరాలేదు. బాధిత కుటుంబం తమకు ప్రభుత్వం నుంచి న్యాయం చేయాలని కోరారు.

మావోయిస్టులకు సహకరించొద్దు

- ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు
- పలు మండలాల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఎస్ఎస్‌తాడ్వాయి : వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

మావోయిస్టులకు ఎవరూ సహకరించకూడదని ములుగు, పస్రా, వెంకటాపురం(ఎం), (కె), ఎస్ఎస్ తాడ్వాయి, వాజేడు, పేరూరు ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, కమలాకర్, రాజు, తిరుపతిరావు శ్రీకాంత్‌రెడ్డి, జక్కుల సతీష్, గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ఆయా కేంద్రాల్లో శుక్రవారం వాహనాల తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితులను విచారించి వదిలేశారు. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని మండల ప్రజలకు సూచించారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామని ఎస్సైలు తెలిపారు. – సాక్షి, నెట్‌వర్క్



ములుగు రూరల్ : తోపుకుంట వద్ద..



వెంకటాపురం(ఎం) : తనిఖీ చేస్తున్న ఎస్సై రాజు



గోవిందరావుపేట : రాఘవపట్నంలో..



వాజేడు: ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్సై



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు

విద్యుత్‌ను ఆదా చేయాలి



పప్కాపురంలో పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏటూరునాగారం: మండలంలోని రైతులు విద్యుత్ ఆదా చేయాలని విద్యుత్‌శాఖ ఏఈ అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పప్కాపురం గ్రామంలో పొలంబాట కార్యక్రమాన్ని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది చేపట్టారు. విద్యుత్ వినియోగం, చార్జీలు, ఉపయోగాలపై ప్రజలకు వివరించారు. విద్యుత్ కనెక్షన్‌లు, ఇతర విషయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటి వినియోగం, విద్యుత్ వినియోగం తగ్గించే మార్గాలను చూడాలన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కొండ సమ్మయ్య, ఏఎల్ఎం మొగిళి, సాయి, రైతులు పాల్గొన్నారు.